క్లుప్తంగా

దేవాలయ నిర్మాణానికి విరాళం

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని వనంపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి దేవాలయం నిర్మాణానికి ఆదివారం పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ రూ.1 లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాజు, నాయకులు సత్యంరెడ్డి, ఆంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఏర్పాటు



కమిటీలో పాల్గొన్న నాయకులు

కొందుర్గు: మదాసి కురువ సంఘం కొందుర్గు మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం షాద్‌నగర్ తాలుకా అధ్యక్షుడు విఠలయ్య తెలిపారు. అధ్యక్షుడిగా పత్తి యాదగిరి, ఉపాధ్యక్షుడిగా కొయ్యల నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా శేఖర్, సంయుక్త కార్యదర్శిగా రామరాజు, కోశాధికారిగా దయ్యాల వెంకటేశ్, గౌరవాధ్యక్షుడిగా మల్లయ్య ఎన్నికైనట్లు ఆయన పేర్కొన్నారు.

జేపీదర్గా అభివృద్ధి పనులకు శంకుస్థాపన నేడు

కొత్తూరు: నేడు(సోమవారం)మండలంలోని జేపీదర్గా మాస్టర్‌ప్లాన్ పనులు, సమీపంలో నిర్మించిన గురుకుల పాఠశాలను మంత్రులు మహమూద్ అలీ, సత్యవతిరాథోడ్‌లు ప్రారంభించనున్నట్లు స్థానిక సర్పంచ్ అజయ్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయకులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

చేవెళ్ల: మండలంలో సమ్మె చేస్తున్న ఆశావర్కర్లు ఆదివారం పర్యటనకు వచ్చిన మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలను కలిసి వినతి పత్రం అందజేశారు. తమకు ఫిక్సిడ్ వేతనం అమలు చేయాలని కోరారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. దీనికి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు సానుకూలంగా స్పందించి సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

చేవెళ్ల టికెట్ కేటాయించండి



కిషన్‌రెడ్డిని కలిసిన విజయ్‌కుమార్

చేవెళ్ల: రానున్న ఎన్నికల్లో చేవెళ్ల నుంచి బీజేపీ ఎమ్మెల్యే టికెట్‌ను తనకు కేటాయించాలని ఆదివారం తులసీరామ్ విజయ్‌కుమార్ కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ బన్సల్‌ను కలిసి కోరారు. అనంతరం తన తన బయోడేటాను అందించినట్లు తెలిపారు. చేవెళ్ల ఎస్సీ నియోజకవర్గం నుంచి తనకు అవకాశం కల్పిస్తే బీజేపీని గెలిపిస్తానని చెప్పారు.

రానున్న ఎన్నికల్లో బీజేపీదే అధికారం

పార్టీ మండల అధ్యక్షుడు రాములు గౌడ్



నరేంద్రమోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని మండల బీజేపీ అధ్యక్షుడు రాములుగౌడ్, జిల్లా అధికార ప్రతినిధి తొండ రవి పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మహిళలకు 33శాతం రిజర్వేషన్, పసుపు బోర్డు, గిరిజన యూనివర్సిటీ, కృష్ణా ట్రిబ్యునల్‌ను ప్రకటించిన సందర్భంగా ఆదివారం శంకర్‌పల్లి, మోకిల ప్రధాన చౌరస్తాల్లో నరేంద్రమోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాష్, చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రాజేందర్‌సింగ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగుమయం 'ఫిరంగి'

- దుర్వాసనతో స్థానికుల అవస్థలు
- ఈగలు, దోమలతో ప్రబలుతున్న విషజ్వరాలు
- పట్టించుకోని అధికారులు..



జనవాడ గ్రామంలోని ఫిరంగి నాలాలో ప్రవహిస్తున్న మురుగునీరు

శంకర్‌పల్లి: చారిత్రాత్మక ఫిరంగి నాలాను స్థిరాస్తి వ్యాపారులు, గ్రామాల్లోని రైతులు చేస్తున్న కబ్జాలతో క్రమంగా ఆనవాళ్లు కోల్పోతోంది. అధికారులు చర్యలు తీసుకోకపోతే నాలుగైదేళ్లలో కనుమరుగయ్యే అవకాశం ఉందని స్థానికలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని బుల్కాపురం గ్రామంలో ప్రారంభమైన ఫిరంగి నాలా మండలంలోని మోకిల, పిల్లిగుండ్ల, గోపులారం, మహారాజ్‌పేట్, మేఖాన్‌గడ్డ మీదుగా హైదరాబాద్‌కు తాగునీరు అందించేందుకు హుస్సేన్ సాగర్ వరకు నిర్మించారు. నాలా బఫర్ జోన్‌తో కలిసి కొన్ని చోట్ల 66అడుగులు.. మరిన్ని చోట్ల 90అడుగులు ఉంది. శంకర్‌పల్లి మండలం మహానగరానికి అతిసమీపంలో ఉండటంతో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతుంది. దీంతో మండలంలోని గ్రామాల్లో భూములు కొనుగోలు చేస్తున్న రియల్ వ్యాపారులు ఫిరంగి నాలాను కబ్జా చేస్తున్నారు. గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం చేస్తున్న ప్రజలు ఫిరంగి నాలాను కబ్జా చేయడంతో పాటు నాలాలో మురుగునీరు వదిలి అన్యాక్రాంతం చేస్తున్నారు.

మురికికూపంగా..

శంకర్‌పల్లి మండలంలోని జనవాడలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఫిరంగి నాలా మొత్తం మురికి కూపంగా మారింది. దీంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. నాలాకు ఇరువైపులా నూతనంగా ఇళ్లు నిర్మించడంతో పరిసరా ప్రాంతాల ప్రజలు నాలాలో మురుగునీరు వదలడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు వాపోతున్నారు. మురుగునీరు పారడంతో దోమలు, ఈగలు ప్రబలి ప్రజలు డెంగి, మలేరియా వంటి విషజ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, గ్రామస్తులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోవడం లేదు..



జనవాడలోని ఫిరంగి నాలా పూర్తిగా మురుగునీటితో నిండిపోయింది. దీంతో తీవ్ర దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమలు, ఈగలు ప్రబలి విషజ్వరాల బారిన ప్రజలు పడుతున్నారు. ఫిరంగి నాలాలోని మురుగు నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. అధికారులు స్పందించి పారిశుద్ధంపై దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

– తలారి మైసయ్య, మాజీ ఎంపీటీసీ

నాలాను పరిశీలించాం

ఫిరంగి నాలాను పరిశీలించి, నాలాలోకి మురుగు నీరు వదలొద్దని గ్రామ ప్రజలకు తెలియజేశాం. మురుగునీటిని వదలడానికి ప్రత్యేక అండర్ డ్రైన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించాం. అలాగే నాలాను మట్టి పోసి పూడ్చే వారిపై చర్యలు తీసుకుంటాం.

– రాధిక, ఇరిగేషన్ ఏఈ

అండర్‌డ్రైన్‌కు ప్రణాళిక సిద్ధం



గ్రామంలోని ఫిరంగి నాలా పరిసరాల్లో ప్రత్యేక అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు రూ.50లక్షలతో ప్రణాళికను సిద్ధం చేశాం. గ్రామానికి చెందిన కొంత మంది వారి రాజకీయ స్వార్థం కోసం పనులు చేపట్టకుండా అడ్డు పడుతున్నారు. అధికారులు సహకరిస్తే ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థను త్వరలో నిర్మిస్తాం

– లలితనర్సింహా, సర్పంచ్, జనవాడ

బూటకపు హామీలతో గద్దెనెక్కిన బీఆర్‌ఎస్

పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్

కేశంపేట: బీఆర్‌ఎస్ పార్టీ బుటకపు హామీలతో గద్దె నెక్కిందని పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్ ఆరోపించారు. మండల పరిధిలోని చింతకుంటపల్లిలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. గ్రామంలో మహిళలు, వృద్ధులకు ఆరు గ్యారంటీ పథకాలు గురించి వివరించారు. బీఆర్‌ఎస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదని గ్రామాల్లోకి వస్తున్న బీఆర్‌ఎస్ నాయకులను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రతిపక్షపార్టీ హోదాలో ఉండి ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశామని గుర్తుచేశారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాదయ్యయాదవ్, శ్రీధర్‌రెడ్డి, రూప్లానాయక్, భాస్కర్‌గౌడ్, పురుషోత్తంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మనోహర్‌గౌడ్, విజయరెడ్డి, తలసాని రమణరెడ్డి, అఖిల్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



చింతకుంటపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న శంకర్

మహిళలకు చీరల పంపిణీ

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని నాగులపల్లిలో ఆదివారం పేపర్‌శీనన్న యువసేన ఆధ్వర్యంలో మహిళలకు చీరల పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా టీయూడబ్ల్యూజే రాష్ట్రకార్యదర్శి గుడిపల్లి శ్రీనివాస్ హాజరై గ్రామ ముఖ్యకూడలిలోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ....గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో కనీస సౌకర్యాల రూపకల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అశ్రఫ్, మల్లేష్, రాజు, శ్రీకృష్ణ, ప్రశాంత్, సంపత్, చందు, నర్సింహ్మా, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



చీరలను పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

దళితుల సంక్షేమానికి బీజేపీ కృషి

ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్

షాద్‌నగర్: దళితుల అభ్యున్నతికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆ పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎంకనోళ్ళ వెంకటేష్ అన్నారు. ఎస్సీ మోర్చా ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు విఠ్యాల నర్సింహ్మ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని దూసకల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి చర్యలు తీసుకుంటుందన్నారు. దళితులను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రధాని మోడీ అండగా ఉంటున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ దళితులను మోసం చేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దళిత బంధు పథకాన్ని పార్టీ నేతలకే ఇస్తున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో దళితులు సీఎం కేసీఆర్ ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని విమర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల ఎస్సీ మోర్చా మండల ప్రధాన కార్యదర్శిగా సంగెం శ్రీకాంత్‌ను ఎన్నుకుని, నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్సీ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ అంతిగారి నరేష్, శ్రీకాంత్, వినోద్, రమేష్, నర్సింహ్మా, కుమార్, సత్యం, రమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాంత్‌కు నియామక పత్రం అందజేస్తున్న వెంకటేశ్

మైనార్టీలకు అండగా బీఆర్‌ఎస్

ఎంపీపీ రవీందర్‌యాదవ్

కేశంపేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనార్టీలకు అండగా ఉంటుందని ఎంపీపీ ఎల్లగమోని రవీందర్ యాదవ్ అన్నారు. ఆదివారం మైనార్టీ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ద్వారా మంజూరైన 60 కుట్టు మిషన్లను వివిధ గ్రామాలకు చెందిన మైనార్టీ మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్‌యాదవ్ మాట్లాడుతూ.. మైనార్టీల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం షాదీఖానాలను నిర్మించిందన్నారు. అలాగే, కబ్రస్తాన్‌లకు ప్రహరీ నిర్మాణాలను కూడా పూర్తి చేశామని తెలిపారు. ప్రభుత్వం మైనార్టీలతో పాటు అన్ని కులాలను ఆదుకుంటుందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరూ లబ్ధి పొందుతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు తలసాని వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, రాములునాయక్, అంజనేయులు, ఎంపీటీసీ మల్లేష్‌యాదవ్, రాజు, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాంచందర్‌నాయక్, జగన్‌రెడ్డి, కుంటి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న ఎంపీపీ

దైవచింతనతో మానసిక ప్రశాంతత

మంత్రి మహేందర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కేతిరెడ్డిపల్లి సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో కేతిరెడ్డిపల్లి అయ్యప్ప సొసైటీ ఆధ్వర్యంలో దేవాలయ నిర్మాణానికి మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు కొబ్బరికాయకొట్టి భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేవాలయాల్లోనే ప్రజలకు మనశాంతి లభిస్తుందన్నారు. మానవుడు మనశాంతికి దేవాలయాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శోభావెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ అర్చన, ఉపసర్పంచ్ సిద్దయ్య, కేతిరెడ్డిపల్లి అయ్యప్ప సొసైటీ సభ్యులు శ్రీశైలం, శ్రీనివాస్, యాదయ్య, యాదయ్య, బాలకృష్ణ, నవీన్‌చారి, ఆర్.శ్రీనివాస్, కృష్ణ, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, పథకాలు దేశానికి దిక్సూచి

రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కేతిరెడ్డిపల్లిలో సర్పంచ్ శోభ ఆధ్వర్యంలో రూ. 1. 35 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్డును ముఖ్యఅతిథులుగా మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి పథంలో సాగుతోందని తెలిపారు. ఏ గ్రామంలో చూసినా, ఏ వీధిలో చూసిన రోడ్లు అభివృద్ధి చెందాయన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్, రాష్ట్ర మహిళా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు శోభ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిధులు మంజూరు చేయడంలో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్ తదితరులు ఎంతో కృషి చేశారని తెలిపారు. సర్పంచ్‌గా నా లక్ష్యం అభివృద్దే ధ్యేయంగా కేతిరెడ్డిపల్లి గ్రామంలో 90 శాతం రోడ్లు పూర్తయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం జేవంతు, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, ఎంపీటీసీ అర్చన, వెంకటాపూర్ సర్పంచ్ మనోజ్‌కుమార్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాహూఫ్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు నరోత్తమ్ రెడ్డి, నర్సింహ్మారెడ్డి, తిరుపతిరెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యే

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కొందుర్గు: మండలంలోని చిన్నఎల్కిచర్ల గ్రామానికి చెందిన పోచయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు మల్లేష్‌గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారికి రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

దాతల కృషి అభినందనీయం

ఇన్‌చార్జి సర్పంచ్ లక్ష్మమ్మ

మొయినాబాద్: గ్రామ అభివృద్ధిలో భాగస్వాములవుతూ సొంత నిధులతో దాతల చేస్తున్న కృషి అభినందనీయమని నాగిరెడ్డిగూడ ఇన్‌చార్జి సర్పంచ్ బంటు లక్ష్మమ్మ పేర్కొన్నారు. మండలంలోని నాగిరెడ్డిగూడలో శివాలయం, హనుమాన్ దేవాలయం వద్ద దాత వీణ రవీందర్‌రావు సొంత నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, నాగిరెడ్డిగూడ నుంచి అజీజ్‌నగర్ వరకు దాత బండారు నర్సింహ్మారావు సహకారంతో ఏర్పాటు చేసిన వీధి దీపాలను ఆదివారం దాతలతో కలిసి ఇన్‌చార్జి సర్పంచ్ బంటు లక్ష్మమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే దాతల సహకారం ఎంతో అవసరమన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజలు తమ వంతు సహకారంతో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం దాతలకు సన్మానం చేసి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు మాణిక్యం, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



దాతను సన్మానిస్తున్న సర్పంచ్ లక్ష్మమ్మ

ప్రభుత్వం స్పందించక పోవడం దారుణం

సీఐటీయూ జిల్లా నాయకుడు సాయిబాబా

కొత్తూరు: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఆశ వర్కర్లు గత కొన్ని రోజులుగా ధర్నాలు, సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సాయిబాబా ఆరోపించారు. ఆదివారం ప్రభుత్వం తీరును నిరసిస్తూ ఆయన ఆశ వర్కర్లతో కలిసి మండలకేంద్రంలో వంటావార్పు నిర్వహించారు. అనంతరం సాయిబాబా మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు మంజుల, కవిత, అనిత, వసంత, చైతన్య, నిర్మలమ్మ, ఇంద్ర, బుజ్జి, మాధవి పాల్గొన్నారు.



కొత్తూరు: వంటావార్పు కార్యక్రమంలో ఆశ వర్కర్లు

వంటావార్పుతో నిరసన

షాద్‌నగర్‌రూరల్: ఆశ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వ్యసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ చేపట్టిన సమ్మె ఆదివారం 14వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశవర్కర్లు వంటావార్పుతో నిరసన చేపట్టారు. అనంతరం శ్రీనునాయక్ మాట్లాడుతూ.. ఆశలకు పారితోషికం కాకుండా కనీస వేతనాలను ఇవ్వాలన్నారు. అనంతరం ఆశ యూనియన్ జిల్లా కోశాధికారి లలిత మాట్లాడుతూ.. నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని అన్నారు. కనీస వేతనం కింద రూ 18వేలు ఇవ్వాలని, రూ 5లక్షల ప్రమాద భీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఈశ్వర్‌నాయక్, ఆశ వర్కర్లు సుజాత, రేష్మ, సరిత, రాధిక, మమత, రజిత, లక్ష్మి, , మాధవి, లావణ్య, యాదమ్మ, శ్రీలత, చంద్రకళ, మరియమ్మ, సుకన్య, సునీత తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల శ్రమ దోపిడీ

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల శ్రమను దోచుకుంటుందని సీఐటీయూ మండల నాయకుడు గోపాల్ విమర్శించారు. వారు చేస్తున్న సమ్మె12 రోజులకు చేరింది. ఈ సందర్భంగా ఆదివారం మధ్యాహ్న భోజన కార్మికులు చెవిలో పువ్వు పెట్టుకొని నిరసన తెలియచేశారు. అనంతరం గోపాల్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు జీఓ 8 ప్రకారం కనీస వేతనాలను ఏరియర్స్‌తో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, కొత్త మెనూను సవరించాలని కోరారు. కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్, మధ్యాహ్న భోజన కార్మికులు చిట్టెమ్మ, శిరీష, యాదమ్మ, జంగమ్మ, లక్ష్మి, స్వాతి, మమత, శిరీష,మాధవి, రెహనా పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

కేశంపేట: మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ఆదివారం కేశంపేటలో ర్యాలీ నిర్వహించి, మనవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



షాద్‌నగర్‌రూరల్: వంటావార్పుతో నిరసన తెలుపుతున్న ఆశలు



షాద్‌నగర్‌రూరల్: చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలుపుతున్న కార్మికులు

రోడ్డెక్కిన తండావాసులు

తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన

షాద్‌నగర్‌రూరల్: తాగునీరు రాక అనేక ఇబ్బందులు పడుతున్నామని తండావాసులు ఖాళీ బిందెలతో ఆదివారం రోడ్డుపై ఆందోళనకు దిగారు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామపంచాయతీ పరిధిలోని కాలనీతండా, ఎన్నగడ్డతండా, తోకరేగడితండాల్లో మంచినీళ్లు రావడంలేదని మహిళలు, యువకులు రోడ్డుపై కంచె వేసి బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తండాల్లోని సమస్యలను నాయకులు, అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపించారు. సమస్యలు పట్టని నాయకులు ఓట్లు కోసం తండాల్లో ఎందుకు తిరుగుతారని ప్రశ్నించారు. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి మొరపెట్టుకున్నా ఫలితం లేదని వాపోయారు. నా పదవీకాలం పూర్తయిందంటూ సర్పంచ్, ఎన్నికల కోడ్ వచ్చిందని పంచాయతీ కార్యదర్శి తప్పించుకుంటున్నారని వాపోయారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



రోడ్డుపై ఆందోళన చేస్తున్న తండావాసులు

తాగునీటి సమస్యకు పరిష్కారం

సర్పంచ్ మహేందర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: కాశీంబౌలి గ్రామంలో గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో దాత మాడి పెంటారెడ్డి కృషితో సమస్య పరిష్కారమవడం అభినందనీయమని సర్పంచ్ మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాశీంబౌలిలో దాత పెంటారెడ్డి మూడున్నర లక్షలతో బోరుబావిని వేసి బోరుమోటార్‌ను ఏర్పాటు చేశారు. ఆదివారం బోరుబావిని సర్పంచ్ మహేందర్‌రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. కాశీంబౌలి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మాడి పెంటారెడ్డి ముందుకు రావడం సంతోషకరమైన విషయమన్నారు. దాతలు, యువకులు గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యు అయినప్పుడే గ్రామాలు త్వరగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. అనంతరం దాత పెంటారెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో నీటి సమస్య ఉందని తెలుసుకొని తనవంతు సహాయంగా సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు కృషి చేస్తాన్నానన్నారు. కార్యక్రమంలో మాడి రాజేందర్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మహేందర్, మల్లేష్, కృష్ణ, తిరుపతిరెడ్డి, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.



బోరుమోటార్‌ను ప్రారంభించిన సర్పంచ్